# గమ్యం

– తిమ్మన శ్యామ్ సుందర్ నాయుడు



ఎయిర్ ఫోర్స్ షష్టి పూర్తి సందర్భంగా 'మేళా'. వస్తువులు చవకగా అమ్ముతారని చాలా మంది వచ్చారు. అప్పడే తిరుగు ప్రయాణంలో వున్నారు చాలా మంది.



ఎయిర్‌ఫోర్స్ క్యాంటీన్ దాటి కాస్త దూరంగా స్కూటర్ ఆపాను.

ఎటు చూసినా జనం.

ట్రాక్టర్ల మీద, రిక్షాల మీద జనం వస్తూనే వున్నారు. స్పెషల్ బస్సులైతే మరి చెప్పనవసరం లేదు.

ఓ సిగరెట్టు ముట్టించి నాలుగు అడుగులు వేశాను.

దూరంగా బాలాజీ, చిన్నారి కూచుని నవ్వుకుంటూ కనిపించారు.

"హలో" అంటూ పలకరించారు.

నవ్వుతూ దగ్గరకెళ్ళాను.

"ఇదేనా రావడం?" పలకరించాడు బాలాజీ.

తల వూపాను.

"అంతా చూశారా?" అడిగాను.

"మేము తిరుగు ప్రయాణంలో కూడా వున్నాం" చెప్పాడు చిన్నారి.

చుట్టూతా చూశాను.

చాలామంది అప్పడే తిరుగుప్రయాణంలో వున్నారు.

ఎయిర్ ఫోర్స్ షష్టిపూర్తి పందర్భంగా 'మేళా' నిర్వహిస్తున్నారని గత వారం రోజులుగా గింగుర్లెత్తే అనౌన్స్‌మెంట్. ఎయిర్ ఫోర్స్ అంటే వస్తువులు చౌకగా అమ్ముతారని చాలామంది బయల్దేరి వచ్చారు. క్యాంటీన్‌లో చౌకగా వస్తువులు తెప్పించుకోవడం చాలామందికి అలవాటేగా.

దూరంగా రెండు చోట్ల మిస్సైల్స్ కనిపిస్తున్నాయి.

షామియానాల క్రింద పది స్టాల్స్ వరకు వున్నాయి.

అందులో రెండు స్టాల్స్‌లో రింగులు వేస్తే బిస్కెట్ ప్యాకెట్లు, సిగరెట్ ప్యాకెట్లు ఇచ్చే లాటరీ జరుగుతూంది.

"అలా వెళ్ళి వద్దామా?" అన్నాను.

"మా పని అయిపోయింది బాబూ, నువ్వెళ్ళిరా. ఇక్కడే వుంటాం" అన్నారు.

సరేనని బయల్దేరాను.

దాదాపు అన్ని స్టాల్స్ దగ్గర జనం విపరీతంగా వున్నారు. ఒక్కొక్క స్టాల్‌నే చూసుకుంటూ అడుగులేస్తున్నాను. కొన్ని స్టాల్స్‌లో నార్త్ ఇండియన్ డిషెస్ వేడివేడిగా చేసి అమ్ముతున్నారు. ఒక స్టాల్‌లో రెడీమేడ్ ఉలెన్ గార్మెంట్స్, మరో స్టాల్‌లో చిన్న ఎగ్జిబిషన్ లాంటిది ఎరేంజ్ చేశారు.

నెమ్మదిగా అక్కడి నుంచి కదిలి ప్రక్క స్టాల్ వైపు నడిచాను.

లోపల ఏముందో కూడా తెలుసుకోడానికి సాధ్యంకానంత జనం అక్కడున్నారు.

నెమ్మదిగా అక్కడి నుంచి కదిలాను.

స్టాల్స్‌కి కాస్త దూరంగా నిలబెట్టివున్న మిసైల్ నన్నాకర్షించింది.

దాని దగ్గర కాసేపు ఆగాను.

ప్రళయాన్ని సృష్టించే మిసైల్ నిద్రపోతున్న మొసలిలా గంభీరంగా వుంది.

చాలాసేపు అలా చూస్తుండిపోయాను.

మైకులో వినిపించిన అనౌన్స్‌మెంటుకి కుర్రకారు హుషారుగా అరవడం వినిపించి అటు చూశాను.

లాటరీలో ప్రైజు వచ్చిన నెంబరుని పదే పదే చదువుతున్నారు.

చిన్నగా నవ్వుకున్నాను.

ఎలాగూ ఇంత దూరం వచ్చాను కదా అలా సముద్రతీరం దగ్గర కెళ్ళి కాసేపు గడిపి ఇంటికి తిరిగి వెళ్దామని అక్కడ్నుంచి కదలి యథాలాపంగా అటుచూశాను.

అక్కడ బ్లాక్ బోర్డ్ మీద అందమైన అమ్మాయి బొమ్మ చాక్‌పీస్‌తో చిత్రించబడి వుంది.

కళ్ళు మూసుకుని నాలుగైదు అడుగులు నడిచి ఆ బొమ్మ నుదుట ఎర్రబొట్టు వున్న ప్రాంతాన్ని సరిగ్గా చూపుడు వేలుతో తాకాలి.

చాలామంది బొట్టు మీద తప్ప ఎక్కడెక్కడో చూపుడు వేలు పెడుతున్నారు. అది చూసి అందరూ నవ్వుతున్నారు.

అది చాలా చక్కని గేమ్.

యూనివర్సిటీలో నేను, రేణుక కలిసి ఆ గేమ్ స్టార్ట్ చేశాం. ఐతే బొట్టు స్టిక్కర్‌ని నుదుటి మీద కరెక్టుగా పెట్టాలి. అలా పెట్టిన వాళ్ళకి చక్కని బహుమతి వుండేది. స్టూడెంట్సు అందరూ ప్రయత్నించి ఎక్కడెక్కడో స్టిక్కర్ అంటించి నవ్వులపాలయ్యేవాళ్ళు.

దానికి కాన్సన్‌ట్రేషన్ వుండాలి, మనసు స్థిరంగా వుండాలి.

రెండు మూడు సార్లు ఫెయిల్ అయినా రేణుక, నేను ఎక్కువగా సక్సెస్ అయ్యేవాళ్ళం. ఫంక్షన్స్ అప్పుడు ఆ గేమ్ తప్పనిసరిగా వుండేది. యూనివర్సిటీలో అదొక క్రేజ్ అయిపోయింది ఆ రోజుల్లో...

ఇప్పుడు సక్సెస్ కాగలనా?

దూరంగా నిలబడి ఆసక్తిగా గమనిస్తున్నాను.

ప్రక్కనే నల్ల కళ్ళజోడు వ్యక్తిని ఓ కుర్రాడు బ్రతిమాలుతున్నాడు.

"ఒక్కసారి సార్" అంటూ టోకెన్ తెచ్చి అతని చేతిలో పెట్టాడు. అతను ఇబ్బందిగానే నవ్వుతూ లేచి నిల్చున్నాడు.

కుర్రాడు అతన్ని ఆ చిత్రపటం దగ్గరకి తీసుకెళ్ళాడు.

అతను ఆ బొమ్మ ముఖాన్ని పూర్తిగా తన చేతి వ్రేళ్ళతో స్పృశించాడు

నాలో క్యూరియాసిటీ పెరిగి రెండడుగులు బ్లాక్‌బోర్డు వైపు వేశాను.

కుర్రాడు ఆ కళ్ళజోడు వ్యక్తి చూపుడు వేలుని ఆ బొమ్మ నుదుటిపై బొట్టు మీద కాసేపు వుంచి ఏదో చెప్పాడు.

ఆ నల్ల కళ్ళజోడు వ్యక్తి అర్థమైనట్లుగా తల పంకించాడు.

కుర్రాడు ఆ వ్యక్తి చేయి పట్టుకుని ఐదడుగులు వెనక్కి నడిపించి వదిలి తను కాస్త ఎడంగా నిలబడ్డాడు.

నేను బిత్తరపోయాను.

ఆ నల్ల కళ్ళజోడు వ్యక్తికి కంటిచూపు లేదు.

అలాంటి వ్యక్తి ఈ పోటీలో పాల్గొంటున్నాడు. మరింత ఉత్సుకతతో దగ్గరకెళ్ళాను.

అతను స్థిరంగా అడుగులేస్తున్నాడు.

ఒకటి... రెండు... ఐదు... తక్కువ ఆగి చాకులా తన చూపుడు వేలుని ముందుకు చాపి ఆ బొమ్మ ముఖంపై నిలిపాడు.

ఒకే ఒక్క క్షణం... ఆ వ్రేలుని పైకి లేపి సరిగ్గా ఆ బొమ్మ నుదుటి మీద సింధూరంలాగా మెరిసే బొట్టుపై పెట్టాడు.

అందరూ చప్పట్లు కొట్టారు.

నేను అచేతనంగా నిలబడిపోయాను.

గెలిచినందుకు వాళ్ళిచ్చిన థమ్సప్ బాటిల్‌ని ఆ కుర్రాడికిచ్చి నవ్వుతూ కుర్చీలో కూర్చున్నాడు అతను.

"మరోసారి సార్!" ఎవరో అడుగుతున్నారు.

"సారీ ప్లీజ్" అంటూ నమ్రతగా తిరస్కరిస్తున్నాడు అతను.

ఇంతలో ఒకావిడొచ్చి అతన్ని పైకి లేపి "సారీ లేటైంది" అంటూ "మళ్ళీ ట్రై చేస్తారా?" అని అడిగింది.

"నో .. నో.. ఇప్పుడే చేశాను" అంటూ నవ్వేడు అతను.

"మరి బయల్దేరదాం" అంటూ స్టిక్ అతనికి అందించి అతని చేయిని తన చేతిలోకి తీసుకుంది.

ఎనిమిదవ ప్రపంచ వింత చూస్తున్నట్లు అలాగే నిలబడి వున్న నన్ను దాటుతూ ఆశ్చర్యంగా తిరిగి చూసి "శేఖర్" అంది ఆమె.

••

అక్కడ బ్లాక్ బోర్డ్ మీద అందమైన అమ్మాయి బొమ్మ చాక్‌పీస్‌తో వేసి వుంది. కళ్ళు మూసుకుని నాలుగైదు అడుగులు నడిచి ఆ బొమ్మ నుదుట సరిగ్గా బొట్టుని చూపుడు వేలుతో తాకాలి. చాలా చక్కని గేమ్. యూనివర్సిటీలో నేను, రేణుక ఆ గేమ్ స్టార్ట్ చేశాం.



క్షణంలో ఈ లోకానికొచ్చాను.

రేణుక ముఖంలో ఆ నాటి కళనే స్పష్టంగా చూడగలిగాను. ఏ మాత్రం మారలేదు. ఎప్పుడూ గలగలా నవ్వుతూ మాట్లాడే రేణుకంటే యూనివర్సిటీలో అందరికీ ప్రాణం.

మనసు బాగోనప్పుడు ఆమెకేసి చూస్తే చాలు, సృష్టికర్తకి సైతం కాస్తంత రిలీఫ్ దొరికితీరుతుంది.

"ఏం చేస్తున్నావ్? ఎక్కడుంటున్నావ్?" అన్న రేణుక ప్రశ్నలకు సమాధానం చెప్పినా నా ఆలోచనలు మాత్రం ఆమె ప్రక్కనే నిలబడున్న ఆ వ్యక్తి చుట్టే నడుస్తున్నాయి...

యూనివర్సిటీలో చదునైపోయాక రేణుకకు దూరమైనా ఆమె మాత్రం నా మనసునుండి దూరం కాలేదు.

"ఈ గుడ్డి వ్యక్తిని ఎప్పుడూ చూడలేదే, ఎవరితను?" అనుకునే లోపలే, "ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ స్కూల్‌లోనే టీచర్‌గా పనిచేస్తున్నాను. ఈయన మావారు" అన్న రేణుక పరిచయ వాక్యానికి గుండెలో మంచి మిసైల్ దూసుకుపోయినట్లుగా స్టన్ అయ్యాను.

అచేతనంగానే ఆయనకు నమస్కారం చేశాను.

"శేఖర్ అని నా క్లాస్‌మేట్. మంచి మనసున్న మనిషి" వాళ్ళాయనకి పరిచయం చేసింది.

"మీకో విషయం చెప్పితీరాలి. ఇందాక స్టాల్‌లో మీరాడిన గేమ్ వుంది చూశారూ.. ఆ సెట్టీ గేమ్‌లో శేఖర్ ఎప్పుడూ ఫస్ట్ వస్తుండేవాడు. అఫ్‌కోర్స్! సెకండ్ ప్లేస్ నాదేననుకోండి" వాళ్ళాయనకి చెప్పింది.

ఆయన చిరునవ్వు నవ్వి, "మనిషికి ఏకాగ్రత వుంటే సాధించలేనిదంటూ ఏదీ వుండదు" అన్నాడు.

"వస్తాను శేఖర్! చీకటి పడిపోతూంది. ఇదిగో నా విజిటింగ్ కార్డ్. మీ ఆవిణ్ణోసారి మా ఇంటికి తీసుకురా" అని కార్డు తీసిచ్చి, దగ్గర్లో పార్క్ చేసున్న మోపెడ్ వైపు నడిచింది.

మోపెడ్ కనుమరుగైన తరువాతగాని వాస్తవంలోకి రాలేకపోయాను.

"రేణుక భర్త గుడ్డివాడు"... "ఎందుకిలా జరిగింది?"

అందమైన రేణుక నవ్వును చూడలేడు ఆమె భర్త.

గుండెలో కలచివేస్తున్నట్లుగా అనిపించింది.

ఆలోచనలు నా అడుగుల్ని బీచ్‌వైపు మళ్ళించాయి.

"రేణుక భర్తకి కళ్ళు లేవు"...

ఐనా రేణుక సెలయేరులాగా ఎంతో హుషారుగా వుంది.

"రేణుక గుడ్డి వ్యక్తిని చేసుకుందా?" మరోసారి అనుకుంటూ సముద్రపు ఒడ్డుకి చేరాను.

అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. ఎగిసిన ప్రతి అల నన్ను ఛెళ్ళున కొడుతున్నట్లుగా అనిపించింది.

చుట్టూ చీకట్లు ముసురుకుంటున్నాయి. నెమ్మదిగా జనం పలచబడుతున్నారు. వేటకెళ్ళిన పడవలు రెండు అప్పుడే తిరిగొచ్చాయి పల్లెకారులు కూడా త్వరత్వరగా ఇళ్ళకు చేరుకోవాలని తాపత్రయపడుతున్నారు.

"ఔను. నేనూ నా గమ్యానికి చేరుకోవాలి...."

జీవితంలో మొట్టమొదటిసారి అలా అనుకున్నాను. పెళ్ళైన ఇన్నాళ్ళకు మొదటిసారిగా అనుకున్నాను.

ఇంట్లో నాలుగ్గోడల మధ్య ఎంతో ఆత్రుతగా నా కోసం ఎదురుచూసే నా భార్య సంధ్య గుర్తుకొచ్చింది.

సంధ్యకి నేను అన్యాయమే చేశాను.

నన్నింకా ప్రేమిస్తుండడమే ఆమె చేస్తున్న తప్పేమో?

పెళ్ళై ఇన్నేళ్ళైనా ఏనాడూ ఆమెని సినిమాకి తీసుకెళ్ళడంగానీ, షికారుకి తీసుకెళ్ళడంగానీ, కనీసం తలలోకి ఇన్ని మల్లెపూలు కొనివ్వడంగానీ నేను చేయలేదు. ఆమంటే నాకున్న అయిష్టతే అందుక్కారణం.

ఎక్కడికెళ్ళినా ఒక్కణ్ణే వెళ్ళేవాణ్ణి. ఈ రోజూ అంతే.

ఇంట్లో నుంచి బయల్దేరే ముందు "నన్నూ ఒక్కసారి మీతో తీసుకెళ్ళరూ?" అన్న ఆమె అభ్యర్థనని ఆ కళ్ళలో నేను గమనించకపోలేదు. ప్రతి రోజూ గమనిస్తూనే వున్నాను కూడా.

ఐనా నా భార్యని నాతో ఎక్కడికన్నా తీసుకెళ్ళాలంటే నాకు నామోషి.

ఎందుకంటే... ఆమె కుంటిది.

ఒక కాలిని ఈడుస్తూ నడుస్తుంది...

ఆకాశంలో చీకట్లు పూర్తిగా అలుముకున్నాయి.

చలిగాలికి స్వల్పంగా వణుకుతున్న నాకు సముద్రపు ఘోష సంధ్య ఆక్రందనలా హృదయవిదారకంగా వినిపిస్తూంది.

తన గుడ్డి భర్తని ఎటువంటి కాంప్లెక్స్ లేకుండా పరిచయం చేసిన రేణుక నవ్వు నన్ను పరిహాసం చేస్తున్నట్లుగా అనిపించింది.

మరేం ఆలోచించకుండా వెనక్కి తిరిగాను... వెంటాడుతున్నట్లున్న సముద్రపు ఘోషను దూరం చేస్తూ అడుగులేశాను. కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ చీకటి ఆకాశంకేసి చూశాను. మెరుస్తున్న నక్షత్రాలు మినుకు మినుకుమంటున్న ఆశలా అనిపించాయి... ఏదో చెప్పలేని రిలీఫ్‌తో మనసంతా తేలికైనట్లుగా అనిపించింది.

నెమ్మదిగా స్కూటర్ దగ్గరకి నడిచి, ఎప్పుడూ ఖాళీగా వుండే వెనక సీటునోసారి చూసి నవ్వుకున్నాను. ఇకపై అక్కడ ఖాళీ వుండదనీ, నా సగం జీవితం వుంటుందనీ అనుకుంటూ స్కూటర్‌ని స్టార్ట్ చేశాను నా గమ్యం చేరుకోడానికి. ▲

• •

రేణుక భర్త గుడ్డి వాడు. అందమైన రేణుక నవ్వును చూడ లేదు. ఎందుకిలా జరిగింది? రేణుక భర్తకి కళ్ళు లేవు. ఐనా రేణుక సెలయేరులాగా హుషారుగా వుంది. రేణుక గుడ్డి వ్యక్తిని చేసుకుందా? సంధ్య గుర్తుకొచ్చింది. సంధ్యకి నేను అన్యాయమే చేశాను.

